ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

నూతన సంవత్సరంలో ఆరోగ్యం ఐశ్వర్యాలతో కుటుంబ సభ్యులు ఉండాలని భగవంతుని కోరుకుంటున్నా

ఎం దామోదర్ రెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్, ప్రభాత ఉదయం
ఫోన్: 9391089608




సంపుటి: 2 | సంచిక: 266 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 1 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



## సమిష్టి కృషితో వికసిత భారత్

**కొత్త సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా మోడీ**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశిస్తూ.. పోస్టు పెట్టారు. ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలను గురించి వివరిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు. 'సమష్టిగా ప్రయత్నించి.. 2024లో అనేక విజయాలు అందుకున్నాం. 2025లో మరింత కష్టపడి పనిచేసి ..మిగతా 2లో

# కొత్త అడుగుల్లోకి ప్రవేశించిన ప్రపంచం

## ఇక చరిత్రలోకి జారుకున్న 2024



**నూతన సంవత్సరంలోకి తొలిగా కిరిబాటి దీవులు తరవాత క్రమంలో న్యూజిలాండ్ ప్రవేశం**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** ప్రపంచ దేశాలకు కొత్త అధినేతలను తీసుకొచ్చిన 2024 ఇక చరిత్రగా మిగలనుంది.అది అందించిన జ్ఞాపకాలను మదిలో పదిలం చేసుకొని.. కొత్త అడుగులు వేయడానికి ప్రపంచం సిద్ధం అవుతోంది. అయితే మనకంటే ముందే కొన్ని దేశాలు కొత్త ఏడాదిని ఆహ్వానించాయి. పసిఫిక్ మహా సముద్రంలోని కిరిబాటి దీవుల్లోని ప్రజలు అందరికంటే ముందే నూతన సంవత్సరాన్ని స్వాగతించారు. తర్వాత న్యూజిలాండ్‌కు చెందిన చాతమ్ ఐలాండ్స్ 2025లోకి ప్రవేశించింది. న్యూజిలాండ్ వాసులు కూడా 2025లోకి అడుగుపెట్టారు. భారత్‌లో కాలమానం ప్రకారం సాయంత్రం 4.30 గంటలకు ఆ దేశం ..మిగతా 2లో



## 4న తెలంగాణ కేబినేట్ భేటీ

**రైతు భరోసా, పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులపై చర్చ**
**యాదగిరిగుట్ట బోర్డు నియామకంపైనా చర్చకు అవకాశం**
**సిఎం రేవంత్ అధ్యక్షతన సచివాలయంలో భేటీ**

**హైదరాబాద్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** తెలంగాణరాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జనవరి 4న సాయంత్రం 4గంటలకు సచివాలయంలో జరగనుంది. రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, టూరిజం పాలసీపై చర్చించే అవకాశముంది. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. కొత్త రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి, దరఖాస్తుల స్వీకరణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్దిదారులకు సబ్సిడీ రేట్లతో ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్న ప్రతిపాదనపై కేబినెట్ చర్చించనున్నట్లు సమాచారం. విద్యుత్ కమిషన్, బీసీ డెడికేటెడ్ కమిషన్, ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికలపై చర్చించే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట దేవాలయానికి తితిదే తరహాలో ..మిగతా 2లో




## సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

**అప్పుడే ఏర్పాట్లు చేపట్టిన ఆర్టీసీ**

**హైదరాబాద్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** సంక్రాంతి పర్వదినం సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారి కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. హైదరాబాద్ నుంచి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు కూడా ప్రత్యేక బస్సులను నడుపనుంది. ప్రయాణికులను ..మిగతా 2లో

## ఫార్ములా-ఈ రేసు కేసులో ముగిసిన విచారణ



**తీర్పు ఇచ్చే వరకు కెటిఆర్‌ను అరెస్ట్ చేయొద్దు**
**మధ్యంతర ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు**

**హైదరాబాద్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** ఫార్ములా-ఈ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. తీర్పు ఇచ్చే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై గత విచారణ సందర్భంగా ..మిగతా 2లో

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు వార్నింగ్




**హైదరాబాద్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు చేసింది చాలు, ఇక ఆపండంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఖాజాగూడా చెరువులో హైడ్రా కూల్చివేతలపై అంశంపై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా వాదనలు విన్న న్యాయమూర్తి. హైడ్రా తీరుపై కన్నెర్ర జేశారు. కూల్చి వేతలు చేపట్టిన ల్యాండ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు ఎలా చెబుతున్నారని ప్రశ్నించింది న్యాయస్థానం. ఆధారాలు ఉన్నాయా అని హైడ్రాను నిలదీసింది. పిటిషనర్ వద్ద ..మిగతా 2లో



2

## భారీగా పెరిగిన మద్యం అమ్మకాలు



## మణిపూర్ అల్లకల్లోలంపై సిఎం విచారణ

**బహిరంగంగా క్షమాపణలు కోరిన బీరేన్ సింగ్**

**ఇంఫాల్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** ఈ ఏడాది అంతా ఎంతో కష్టంగా గడిచిపోయింది. చాలామంది తమ కుటుంబాలను కోల్పోయారు. మరికొందరు వారి ఇళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చింది. 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితిపై చింతిస్తున్నాను అని మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ ప్రజలను క్షమాపణలు కోరారు. గత మే నుంచి నేటి వరకు రాష్ట్రంలోని పరిణామాల విషయంలో ప్రజలను క్షమాపణలు కోరుతున్నా' అని సీఎం మీడియా ఎదుట పేర్కొన్నారు. జాతుల మధ్య వైరంతో మణిపూర్‌లో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని ఉద్రిక్త పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ మరోసారి స్పందించారు. ఈ ఏడాదంతా ..మిగతా 2లో

## నా తెలంగాణలో బువ్వకోసం ఏడ్పులా

**పట్టెడన్నం కోసం పసిబిడ్డల ఆర్తనాదాలు : కేటీఆర్**

**హైదరాబాద్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ సర్కార్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. అన్నపూర్ణ వంటి నా తెలంగాణలో బువ్వకోసం బిడ్డల ఏడ్పులా అని ఆవేదన వ్యక్తం చేశారు. 1.50 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిన నా తెలంగాణలో పట్టెడన్నం కోసం పసిబిడ్డలు ఆర్తనాదాలు చేస్తున్నారని అన్నారు. దశాబ్దాల కాంగ్రెస్ పాలన మూలంగా ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు, అంబలి కేంద్రాలకు నిలయమైన తెలంగాణను పదేళ్ల కేసీఆర్ ..మిగతా 2లో






# సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

మొదటి పేజీ తరువాయి...

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు 6,432 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. అందులో 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించింది. గతేడాది సంక్రాంతికి 4,484 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక రూపొందించగా.. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో 5,246 బస్సులను నడిపింది. గత సంక్రాంతి అనుభవాల దృష్ట్యా ఈసారి 6,432 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. జనవరి 9 నుంచి 15 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్‌బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసేలా ప్రత్యేక అధికారులను ఆర్టీసీ నియమించింది. అమలాపురం, కాకినాడ, కందుకూరు, నర్సాపురం, పోలవరం, రాజమహేంద్రవరం, రాజోలు, ఉదయగిరి, విశాఖపట్నం, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, శ్రీశైలం, తిరుపతి, తదితర ప్రాంతాలకు ఈ బస్సులు నడుస్తాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుగు పయనమయ్యే వారి కోసం కూడా ప్రత్యేక బస్సులను సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సంక్రాంతికి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ నుంచి ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంచేలా ఎ÷-లాన్ చేస్తోంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అమల్లో ఉంటుందని తెలిపింది. ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని వివరించింది. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను చేసుకోవాలని పేర్కొంది. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ 040-69440000, 040-23450033 నంబర్లకు సంప్రదించాలని సూచించింది.

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు

# హైకోర్టు వార్నింగ్

మొదటి పేజీ తరువాయి...

అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయి కదా అని హైడ్రాను ప్రశ్నించింది కోర్టు. ఎఫ్‌టీ ఎల్, బఫర్ జోన్ పరిధి తేల్చకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని నిలదీసింది. కమిషనర్‌కు చెప్పి కూల్చివేతలు ఆపివేయాలని ఆదేశించారు న్యాయమూర్తి. లేదంటే తాము ఎలా డీల్ చేయాలో అలా డీల్ చేస్తామని తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటివి పునరావృతం అయితే కమిషనర్ రంగనాథ్‌పై సీరియస్ యాక్షన్ తీసుకోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు న్యాయమూర్తి. ఇదే సమయంలో పిటిషనర్‌కు కూడా కీలక ఆదేశాలిచ్చింది హైకోర్టు ధర్మాసనం. పిటిషనర్ కూడా జీహెచ్‌ఎంసీ పర్మిషన్ లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేయకూడదన్నారు. పిటిషనర్ వేసిన తాత్కాలిక ఫెన్సింగ్ కూడా 24 గంటల్లో పిటిషనరే తొలగించాలని హైకోర్టు ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# నా తెలంగాణలో బువ్వకోసం ఏడ్పులా

మొదటి పేజీ తరువాయి...

పాలనలో దేశానికే అన్నపూర్ణగా నిలిపామని గుర్తు చేవారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అన్నమో రామచంద్రా అని ఆకలి కేకలు వినిపించే పరిస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో గురుకులాల్లో చదువుకుని ఎవరెస్ట్ శిఖరాలు అధిరోహించి, వందశాతం ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. కానీ ఇప్పుడు అదే విద్యార్థులు గుప్పెడన్నం కోసం నేడు గుండెలవిసేలా రోదిస్తున్నారు.. సిగ్గు సిగ్గు అని విమర్శించారు. ఇది పాలకుల పాపం కానీ.. విద్యార్థులకు శాపంగా మారిందని చెప్పారు. జాగో తెలంగాణ జాగో అని ప్రజలకు పిలుపునిచ్చారు.

### ఫార్ములా-ఈ రేసు కేసులో

# ముగిసిన విచారణ

మొదటి పేజీ తరువాయి...

ఈనెల 30 వరకు అరెస్టు చేయొద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. ఆ తర్వాత విచారణ 31కి వాయిదా పడింది. తాజాగా ఇరు వైపులా వాదనలు ముగియగా.. కేటీఆర్ పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేసింది. తీర్పు ఇచ్చే వరకు అరెస్టు చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు పొడిగించింది. ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫార్ములా - ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు. బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ - కార్ల రేసింగ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు. దర్యాప్తు ఏ దశలో ఉందని ఈ సందర్భంగా ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉందని.. అన్ని ఆధారాలు బయటపడతాయని ఏజీ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదుదారు దానకిశోర్ వాంగ్మూలం సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. నిందితులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా అని న్యాయస్థానం అడిగింది. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు. దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

## మణిపూర్ అల్లకల్లోలంపై సిఎం విచారణ

మొదటి పేజీ తరువాయి...

దురదృష్టకరంగా గడిచిందని.. అందుకు రాష్ట్ర ప్రజలను క్షమాపణలు కోరారు. 'రాష్ట్రంలో 12 వేలకు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 625 మంది నిందితులు అరెస్టయ్యారు. 5,600 ఆయుధాలు, 35 వేల మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత మూడు, నాలుగు నెలలుగా రాష్ట్రంలో శాంతి నెలకొనడాన్ని చూస్తూనే ఉన్నాం. మణిపుర్ క్షేమం కోసం తగిన భద్రతా సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం పంపింది. అంతేకాకుండా.. నిర్వాసితుల కోసం నిధులను సమకూర్చింది. త్వరలో గృహ నిర్మాణాలు చేపడతాం. వచ్చే ఏడాది నుంచి శాంతి స్థాపన జరుగుతుందని ఆశిస్తున్నా' అని విశ్వాసం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలోని అన్ని కమ్యూనిటీ ప్రజలకు ఒక్క విషయాన్ని చెప్పాలనుకుంటున్నా. ఇప్పటివరకు మణిపుర్‌లో జరిగిన తప్పిదాలను క్షమించి, చేదు జ్ఞాపకాలను మర్చిపోదాం. రాష్ట్ర అభివృద్ధి కోసం కొత్తగా మన జీవితాలను ప్రారంభిద్దాం. అన్ని జాతుల వారు కలిసికట్టుగా జీవించాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం పేర్కొ?న్నారు. కాగా.. గతేడాది మే నెలలో మణిపుర్‌లోని కుకీ, మైతేయి తెగల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో ఇప్పటి వరకు 225 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చాలా మంది ఇప్పటికీ సహాయ కేంద్రాలలో తలదాచుకుంటున్నారు. ఈ క్రమంలోనే స్పందించిన బీరేన్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# కొత్త అడుగుల్లోకి ప్రవేశించిన ప్రపంచం



మొదటి పేజీ తరువాయి...

కొత్త ఏడాదిని స్వాగతించింది. ఆనందోత్సాహాల మధ్య కివీస్ ప్రజలు నూతన సంవత్సరాన్ని ఆహ్వానించేందుకు సిద్ధమయ్యారు. ఆక్లాండ్ స్కై టవర్ వద్ద న్యూఇయర్ వేడుకలు అట్టహాసంగా మొదలు అయ్యాయి. ఆస్ట్రేలియాలో మనకంటే అయిదున్నర గంటల ముందు నూతన సంవత్సరం మొదలవుతుంది. ఇక సూర్యుడు ఉదయించే దేశంగా పేరున్న జపాన్ కూడా మూడున్నర గంటల ముందే 2025లోకి అడుగుపెడుతుంది. ఇదే సమయానికి దక్షిణ కొరియా, ఉత్తరకొరియా దేశాలు కూడా కొత్త ఏడాదిలోకి ప్రవేశిస్తాయి. భారత్ పొరుగు దేశాలైన భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ మనకంటే 30 నిమిషాల ముందు కొత్త సంవత్సరంలోకి వెళ్తాయి. సమోవాలో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమైన ఎనిమిదిన్నర గంటలకు మనం 2025లోకి అడుగుపెడతాం. అదే సమయానికి భారత్‌తో పాటు శ్రీలంకలోనూ జనవరి ఒకటి వస్తుంది. ఇక మన తర్వాత సుమారు నాలుగున్నర గంటలకు అత్యధికంగా 43 దేశాలు ఒకేసారి కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతాయి. వాటిలో జర్మనీ, నార్వే, ఫ్రాన్స్, ఇటలీ లాంటి ఐరోపా దేశాలతో పాటు కాంగో, అంగోలా, కామెరూన్ లాంటి ఆఫ్రికా దేశాలు ఉన్నాయి. భారత్ తర్వాత అయిదున్నర గంటలకు ఇంగ్లండ్‌లో న్యూఇయర్ మొదలవుతుంది. మనకు జనవరి 1 ఉదయం 10.30 గంటలు అయినప్పుడు అమెరికాలోని న్యూయార్క్ కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతుంది. ఇక కొత్త సంవత్సరం ఆఖరుగా వచ్చే భూభాగాలు అమెరికా పరిధిలోని బేకర్, హోవార్డ్ దీవులు. అయితే ఇక్కడ జనావాసాలు లేకపోవడంతో అమెరికన్ సమోవాను చివరిదిగా పరిగణిస్తారు. రష్యాలో నూతన సంవత్సర వేడుకలను రెండుసార్లు జరుపుకొంటారు. ఆయా దేశాల క్యాలెండర్ల ప్రకారం అక్కడ న్యూఇయర్ వేడుకలు జరుగుతాయి.

# 4న తెలంగాణ కేబినేట్ భేటీ

మొదటి పేజీ తరువాయి...



ప్రత్యేక బోర్డు ఏర్పాటుపై మంత్రిమండలి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యాదగిరిగుట్ట ఆలయానికి 20 మందితో పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నూతన టూరిజం పాలసీపై కేబినెట్ ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. కొత్త టూరిజం పాలసీపై ఇటీవల అసెంబ్లీలోనూ చర్చించారు. కొత్త ఏడాది కానుకగా తెలంగాణ ప్రభుత్వం పలు హామీల అమలుకు సంబంధించి నిర్ణయం తీసుకోనుంది. అందులో భాగంగా జనవరి 4న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. సెక్రటేరియట్ లో సాయంత్రం 4 గంటలకు ఈ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. కేబినెట్ సమావేశంలో కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, బీసీ రిజర్వేషన్ లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక, ఎస్సీ వర్గీకరణ, భూమిలేని నిరుపేదలకు రూ.12 వేల సాయం మొదలైన అంశాలపై చర్చించనున్నారు. ఇప్పటికే రైతు భరోసా, భూభారతి, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అసెంబ్లీలో చర్చించిన విషయం తెలిసిందే. సంక్రాతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. అందులో భాగంగా ఇటీవల ఉపముఖ్యంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సబ్ కేబినెట్ భేటీ జరిగింది. కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, భూభారతి, నిరుపేదలకు 12 వేల ఆర్థిక సాయం తదితర అంశాలపై ఉపసంఘం సమావేశంలో చర్చించారు. మంత్రి వర్గ ఉపసంఘంలో చర్చించిన అంశాలను కేబినెట్ కు సిఫారసు చేశారు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. సబ్ కేబినెట్ లో చర్చించిన అంశాలను అభిప్రా యాలను జనవరి 4న జరగబోయే కేబినెట్ పరిగణనలోకి తీసుకోనుంది. ఉపసంఘం సిఫారసుల ఆదారంగా చర్చించి ఈ అంశాలపై నిర్ణయం తీసుకోనున్నారు. కొత్త సంవత్సరం, సంక్రాంతి కానుకగా రాష్ట్ర ప్రజలకు శు భవార్త చెప్పేందుకు మరికొన్ని పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టింది. జనవరి నాలుగున రాష్ట్ర ప్రజలకు దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన జారీ చేయనుంది .

# భారీగా పెరిగిన మద్యం అమ్మకాలు



**హైదరాబాద్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** న్యూ ఇయర్ వేళ రాష్ట్రంలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. నిన్న ఒక్కరోజే మద్యం అమ్మకాల ద్వారా రూ. 402 కోట్ల 62 లక్షల ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరింది. డిసెంబర్ 31 నేపథ్యంలో నిన్నటి నుంచే బెవరేజ్ శాఖ నుంచి భారీగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే మద్యం దుకాణాలకు భారీగా లిక్కర్ చేరింది. నిన్న 3,82,265 కేసుల లిక్కర్, 3,96,114 కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయి. ఇవాళ లిక్కర్ అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

### అర్ధరాత్రి వరకు మద్యం షాపులు ఓపెన్

డిసెంబర్ 31న వైన్స్ షాపులు సమయ వేళలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్ధరాత్రి వరకు వైన్ షాపులు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలాగే బార్‌లు, రెస్టారెంట్‌లు కూడా తెల్లవారుజామున 1:00 గంటల వరకు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. ఈ మార్పులను ధృవీకరిస్తూ ఎక్సైజ్ శాఖ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.




### ఐఆర్‌సీటీ

# మళ్లీ డౌన్

**ఇది నెలలో మూడోసారి..**

**తీవ్ర అసహనానికి గురైన ప్రయాణికులు**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజమ్ కార్పొరేషన్ వెబ్‌సైట్ మరోసారి డౌనయ్యింది. మంగళవారం ఉదయం ఆశ్చర్యకరంగా తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలోనే వెబ్‌సైట్ మొరాయించింది. దాంతో యూజర్లు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం వెబ్‌సైట్‌ను సరిదిద్దే పనులు కొనసాగుతున్నాయని, అందువల్ల కొంతసేపు టికెట్ బుకింగ్‌లు, కాన్సిలేషన్‌లు చేయడం వీలుపడదని ప్రకటించారు. కాగా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ డౌన్ అవడం ఈ నెలలో ఇదే తొలిసారి కాదు. ఇప్పటికే రెండు సార్లు ఈ సమస్య వచ్చింది. తాజాగా మూడోసారి సమస్య తలెత్తింది. డిసెంబర్ 26న ఏకంగా గంటన్నర పాటు బుకింగ్స్ నిలిచిపోయాయి. అంతకు ముందు డిసెంబర్ 9న కూడా వెబ్‌సైట్ రెండు గంటలపాటు సతాయించింది. ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా టూర్ ప్లాన్ చేసుకున్నవాళ్లు టికెట్ బుక్ చేసుకుందామంటే సమస్య తలెత్తింది. వెబ్‌సైట్ ట్రాకర్ డౌన్ డిటెక్టర్ ప్రకారం దాదాపు 47 శాతం మందికి వెబ్‌సైట్ యాక్సెస్ కాలేదు. 42 శాతం మందికి యాప్ ఓపెన్ కాలేదు. 10 శాతం మంది టికెట్ బుకింగ్ చేసుకోలేకపోయారు. ఉదయం 10 గంటల నుంచి యూజర్లు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. దీనిపై రైల్వేశాఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. గతంలో రెండుసార్లు సైట్ డౌన్ అయినప్పుడు కూడా రైల్వే శాఖ ఎలాంటి స్పందన తెలుపలేదు. కాగా ఈ నెలలో మూడు సందర్భాల్లోనూ తత్కాల్ టికెట్లు ప్రారంభం కావడానికి సరిగ్గా 10 నిమిషాల ముందే ఉదయం 9.50 గంటలకు సైట్ డౌన్ కావడం గమనార్హం.

### సమిష్టి కృషితో

# వికసిత భారత్

మొదటి పేజీ తరువాయి...

వికసిత్ భారత్ కలను సాకారం చేసుకుందాం' అని మోదీ పేర్కొన్నారు. దీనితో పాటు ఈ ఏడాది భారత్ సాధించిన విజయాలకు సంబంధించిన వీడియోను ఆయన పంచుకున్నారు. ఈ వీడియో ఒక ఏడాది కాలంలో సాధించిన పురోగతి, ఐక్యత, వికసిత్ భారత్ వైపు వేసిన అడుగులను గుర్తుచేస్తుందన్నారు.



మాతృదేవో భవ అనాథల ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న యేసు రక్త స్వరం సొసైటీ, ఫౌండేషన్ నిర్వాహకురాలు సిస్టర్ సుజాత, సభ్యులు



దుప్పట్లు పంపిణీ చేసిన సిస్టర్ సుజాత

# అనాధలకు దుప్పట్లు పంపిణీ చేసిన యేసు రక్త స్వరం సొసైటీ, ఫౌండేషన్ సభ్యులు

బుద్వేల్,డిసెంబరు31(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవుపల్లి డివిజన్ మధుబన్ కాలనీ లో గల యేసు రక్త స్వరం సొసైటీ, ఫౌండేషన్ నిర్వాహకులాలు సిస్టర్ సుజాత ఆధ్వర్యంలో నాదర్ గుల్ లోని మాతృదేవోభవ అనాధ ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిస్టర్ సుజాత మాట్లాడుతూ, మాతృదేవోభవ అనాధ ఆశ్రమంలో నిర్వాహకులు ఎంతో చక్కగా అనాధలకు సేవలు అందిస్తున్నారని అభినందించారు. క్రిస్టమస్ పర్వదినాలలో తాము కూడా తోటి వారికి సేవా అందించాలనే ఆలోచనతో అనాధలైన వారికి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

# డివిజన్ అభివృద్ధికి కృషి: తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, డిసెంబరు31(ప్రభాత ఉదయం):మైలార్దేవుపల్లి డివిజన్ మధుబన్ కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, నాలా పనులను మంగళవారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. నాలా పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండ చూడాలన్నారు. మైలార్ దేవుపల్లి డివిజన్లో లోని ప్రతి బస్తీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తునే ఉన్నానన్నారు. నిరంతరం ప్రజలకోసం ఆలోచిస్తు వారి సమస్యలను పరిష్కరిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ నర్సింహ్మా మూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ భాను, సూపర్వైజర్ వినయ్. ముఖ్య నాయకులు బుచ్చిరెడ్డి, ఉత్తం యాదగిరి, కిరణ్, భూపతిరెడ్డి, రామక్రిష్ణ, అభి నర్సింహ్మా, చందు నాయక్, స్థానికులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి




శివరాంపల్లి మార్గంలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయు నాయకులు

# తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములుపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి : సీఐటీయు డిమాండ్

బుద్వేల్, డిసెంబరు31(ప్రభాత ఉదయం): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పై దాడి చేసి అవమానపరిచిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయు రంగారెడ్డి జిల్లా సహయ కార్యదర్శి ఎస్.రామ్మోహన్, ఉ పాధ్యక్షులు జె.రుద్రకుమార్ డిమాండ్ చేశారు. రాములు మాస్టారు పై దాడి చేసిన వారిని శిక్షిం చాలంటు ఆరాంఘర్ నుంచి శివరాంపల్లి వెళ్లే దారిలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థిని నిలబెట్టాడని, కాలుతో తన్నాడని అబండాలు వేస్తు రాములు మాస్టారుపై దాడి చేశారన్నారు. రాములు మాస్టారును కొట్టి, అతని బట్టలు చింపేసి, పాఠశాలలో స్వీపర్ గా పనిచేస్తున్న వ్యక్తికి చెందిన టీ షర్టు వేసి విద్యార్థి కాళ్లు మొక్కించారని వాపోయారు. పాఠశాలకు అలస్యంగా వచ్చాడని నిలబెడితే, హెూంవర్క్ చేయలేదని నిలబెడితే అం దరు కూడకట్టుకుని వచ్చి దళితుడైన ప్రధానోపాధ్యాయున్ని పై దాడి చేసి గాయపరిచారన్నారు. రాములు మాస్టారుపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బచ్చులకూర స్వామి, కాలే రాజు, భాస్కర్, మన్యం, శివ, శ్రీకాంత్, రంగస్వామి, బలరాం, యాదగిరి, మహబూబ్ పాషా, సుదాకర్ రెడ్డి, నర్సింహ్మా, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్ స్కూళ్లను ప్రభుత్వం అదుకోవాలి

## రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం విజ్ఞప్తి

## గురునానక్ స్కూల్లో జరిగిన మండల స్థాయి అంతర పాఠశాలల క్యారమ్స్ పోటీల్లో ఉత్సాహం పాల్గొన్న విద్యార్థులు

రాజేంద్రనగర్ , డిసెంబర్ 31(ప్రభాత ఉదయం)రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహం పాల్గొన్నారు. మంగళవారం సి క్ చావునీ లోని గురునానక్ హైస్కూల్లో నిర్వహించిన క్యారమ్స్ పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి. శరవణ్ కుమార్ లు సంఘం కోశాధికారి ఎస్ఆర్.రజినీకాంత్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణతో కలసి ప్రారంభించారు. సుమారు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు క్యారమ్స్ పోటీల్లో పాల్గొని తమలోని క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈసందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ రాజేంద్రనగర్ మండల పరిధిలోని బడ్జెట్స్ స్కూల్స్ యాజమాన్యం ఏకతాటి పై ఉంటూ విద్యార్థుల్లో విద్యాభివృద్ధి తోపాటు, క్రీడా నైపుణ్యాన్ని, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికే ప్రైవేట్ పాఠశాలల అంతర క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్కూళ్ల కారణంగా బడ్జెట్ స్కూళ్ళకు తీరని అన్యాయం, నష్టం జరుగుతుందన్నారు. దీని పై ప్రభుత్వం ఆలోచించి బడ్జెట్ స్కూళ్ళను ఆదుకోవడానికి ప్రత్యేక చొరవ చూపాలని వారు కోరారు. విద్యాశాఖ ఆదేశాలను తూచ తప్పకుండా ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు కొనసాగేలా యాజమాన్య సంఘం ఎప్పటికప్పుడు కృషి చేస్తుందని తెలిపారు. తమ తమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడా, పోటీ తత్వ నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ మండల స్థాయి ప్రైవేట్ పాఠశాలల అంతర క్రీడోత్సవాలు దోహం చేయాలనేదే తమ లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ. యాదగిరి, కరస్పాండెంట్లు మధుసూధన్, కరుణాకర్, రాజేంద్రప్రసాద్, మహ్మద్ వాజిద్, శేషు, గురునానక్ స్కూల్ పిఈటి అమృతపాణి తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియ సికిల్ సెల్ సొసైటీలో నూతన సంవత్సర వేడుకలు

బుద్వేల్, డిసెంబరు31(ప్రభాత ఉదయం):శివరాంపల్లి రాఘవేంద్ర కాలనీలో గల తలసేమియ సికిల్ సెల్ సోసైటీ ఆవరణలో మంగళవారం నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించారు. సిబ్బంది, రోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. తలసేమియ తో బాధపడుతున్న వారి శ్రేయస్సు కోసం అవిశ్రాంతంగా అంకితభావంతో పనిచేసు న్న వైద్య, సహాయక సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్ తో పాటు సభ్యులు పాల్గొన్నారు.





తలసేమియా సికిల్ సెల్ సొసైటీ లో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న సంస్థ యాజమాన్యం, సిబ్బంది



వాచ్ నైట్ సర్వీస్‌లో మాట్లాడుతున్న రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్



# రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చ్‌లో వాచ్ నైట్ సర్వీస్

బుద్వేల్, డిసెంబరు31(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చ్ లో మంగళవారం రాత్రి వాచ్ నైట్ సర్వీస్ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ ఆద్వర్యంలో ప్రార్ధనలు నిర్వహించారు. విశ్వాసులందరు సాక్ష్యం చెప్పి దేవుని మహిమ పరిచారు. రాత్రి 12 కాగానే రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ ఆద్వర్యంలో ప్రార్ధనలు చేశారు. చప్పట్లు కొట్టి దేవుని మహిమ పరిచారు. జీవ నదిని నా హృదయం లో ప్రవహింప చేయుమయా... అంటు ఆరాధనలో నడిపించారు. దేశం కోసం, పాలకుల కోసం, దేశాన్ని కాపల కాస్తున్న భద్రతా దళాల కోసం ప్రార్థనలు నిర్వహించారు. 40వ కీర్తనలు చదివి వివారించారు. యెషయా 58వ అధ్యాయం 10 వచనం చివరి రెండు లైన్లలో ఉన్న అంధకారము నీకు మధ్యాన్నం వలే ఉండును. చీకటిలో నీ వెలుగు ప్రకాశించును అనే వాక్యం సంఘు వాగ్దాన వాక్యముగా వివరించారు. అందరికి నూతన సంవత్సర వాగ్దానాలు అందచేసారు. సిస్టర్ సే హెచ్ ప్రభావతి ముగింపు ప్రార్ధన చేశారు.



# వాసవి క్లబ్ ఇంటర్నేషల్ వి102ఎ గవర్నర్‌గా డా. సరాబు అనంతం గుప్త ఏకగ్రీవం

రాజేంద్రనగర్, డిసెంబర్ 31(ప్రభాత ఉదయం) వాసవి క్లబ్ ఇంటర్నేషల్ వి102ఎ జిల్లా గవర్నర్ గా రాజేంద్రనగర్ సర్కిల్ సాయిబాబానగర్ కు చెందిన డాక్టర్ సరాబు అనంతం గుప్త ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ఉన్న షాద్ నగర్ కి చెందిన సూరిశెట్టి నరసింహా గుప్త పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో నూతన గవర్నర్ గా వాసవి క్లబ్ ఇంటర్నేషల్ డిస్ట్రిక్ట్ వి.102ఎ ప్రతినిధులు డాక్టర్ సరాబు అనంతరం గుప్తను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. 2025 జనవరి 1వ తేదీ నుంచి ఏడాది కాలం పాటు డాక్టర్ సరాబు అనంతం గుప్త వాసవి క్లబ్ ఇంటర్నేషల్ డిస్ట్రిక్ట్ వి.102ఎ గరవర్నర్ గా కొనసాగుతారు.

# ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్



మల్కాజిగిరి, డిసెంబర్ 31(ప్రభాత ఉదయం) మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా మల్కాజిగిరి నియోజక వర్గ ప్రజలందరికి మర్రి రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో " తెలంగాణ వాసులు, దేశవిదేశాలలో స్థిరపడిన, నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.నూతన సంవత్సరం-2025 ఆరంభం సందర్భంగా వేడుకలను ప్రశాంతంగా, ఆనందంగా, ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జరుపుకోవలసిందిగా,మద్యంసేవించి వాహనాలు నడుపొద్దని యువతకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఉద్బోధించారు.కొత్త ఆలోచనలు, ఆకాంక్షలు,సుస్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, నిబద్ధత,పట్టుదలతో ముందుకు సాగుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలని యువతను కోరారు.కొత్త సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో తులతూగాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మర్రి రాజశేఖర్ రెడ్డి అభిలషించారు.

# తన కూతురును అవమానించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుని, ఆమె వైద్యం కోసం ప్రభుత్వం సహాయం అందించాలి



గడ్డ లావణ్య



జి. నాగరాజు

బుద్వేల్ డిసెంబరు31(ప్రభాత ఉదయం): తన కూతురును మానసికంగా వేదించిన ఉ పాధ్యాయులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాల భవనంపై నుంచి దూకి గాయపడ్డ తన కూతురు వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం సహాయం చేయాలని లక్ష్మీగూడ కు చెందిన జి.నాగరాజు విజ్ఞప్తి చేశారు. వివరాలలోకి వెళితే.... మహబూబ్ నగర్ జిల్లా హన్వాడ మం డలం చిన్నధార్ పల్లికి చెందిన గడ్డ నాగరాజు బ్రతుకు దెరువు కోసం రాజేంద్రనగర్ సర్కిల్ లక్ష్మీగూడ కు వచ్చి స్థిరపడ్డాడు. కూలి పనులు చేస్తు పిల్లల్ని చదివిస్తున్నాడు. తన కూతురు లావణ్య 5వ తరగతి చదువుతుండగా రెసిడెన్షియల్ స్కూల్ లో సీటు రావడంతో చేర్పించాడు. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం మండలం చెర్ల పటేల్ గూడలో గల మహాత్మా జ్యోతిరావు పూలే తెలం గాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ (ఎంజేపీటీబీసీడబ్ల్యు ఆర్ఎస్) లో 10వ తరగతి చదువుతుంది. నీకు చదువు రాదు. నువ్వు చదివి దండుగ, బతికి దండుగ అంటు టీచర్ వేదింపులకు ఇబ్రహీంపట్నం మండలం చెర్లపటేల్ గూడలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ (ఎంజేపీటీబీసీడబ్ల్యు ఆర్ఎస్) లో 10వ తరగతి చదువుతున్న తన కూతురు జి. లావణ్య నవంబరు 9వ తేదీన స్కూల్ మొదటి అంతస్థు నుంచి దూకి తీవ్రంగా గాయపడిందని ఆమె తండ్రి జి.నాగరాజు తెలిపారు. 46 రోజులు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందిందని, శస్త్ర చికిత్స చేశారని గుర్తు చేశారు. నవంబరు 25న డిశ్చార్జి చేశారని, అయినా తన కూతురు నేటికి పూర్తిగా కోలుకోలేదన్నారు. ప్రస్తుతం తన కూతురు మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల లో వైద్యం చేసుకుంటుందని తెలిపారు. తన కూతురును వేదించి ఆమె పాఠశాల భవనంపై నుంచి దూకడానికి కారకులైన ఉపాధ్యాయులను శిక్షించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన కూతురు వైద్యం కోసం సహాయం అందించాలని నాగరాజు కొరారు.

# పీజేపీ క్యాంప్‌లోనే జిల్లా కోర్టు సముదాయ నిర్మాణానికి సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి




న్యాయవాదుల నిరసన దీక్ష విరమింప చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణ ప్రజల, ప్రముఖుల, ప్రజా సంఘాల మద్దతుతో గత 14 రోజుల నుంచి జిల్లా కోర్టు న్యాయవాదులు చేపట్టిన దీక్షలు మంగళవారం విరమింపజేశారు. జిల్లా కోర్టు సముదాయాన్ని అనంతపురం గుట్టల్లోకి తరలించడాన్ని రద్దు చేస్తూ పిజెపి క్యాంప్ లో జిల్లా కోర్టు సముదాయాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో నిర్వహిస్తున్న దీక్షలపై నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్, జెడ్పి మాజీ చైర్ పర్సన్,కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జీ సరితలు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్లారు. బార్ అసోసియేషన్, ప్రజల కోరిక మేరకు పిజెపి క్యాంప్ లో ఏర్పాటు చేసేందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. దీంతో కాంగ్రెస్ నాయకులు గంజిపేట్ శంకర్, మహ్మద్ ఇసాక్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆర్.తిరుమలేష్ పార్టీ శ్రేణులతో కలిసి న్యాయవాదుల నిరసన దీక్ష శిభిరానికి చేరుకుని నిమ్మరవసం ఇచ్చి దీక్షలు విరమింప చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజల,ప్రజా సంఘాల సమిష్టి మెజార్టీతో న్యాయవాదులు కోరిక నెరవేరుతుందన్నారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర కానుకగా సీఎం రేవంత్ రెడ్డి కి జిల్లా ప్రజల,గద్వాల బార్ అసోషియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, అల్వాల రాజశేఖర్ రెడ్డి, పెదొడ్డి రామకృష్ణ,లత్తిపురం వెంకట్రామిరెడ్డి, మాల మహానాడు శ్రీనివాసులు, జమ్మిచేడు ఆనంద్,మోహన్ రావు,అచ్చన్న గౌడ్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రఘురాం రెడ్డి, ఖాజా,ఇక్బాల్ పాషా,సుధాకర్, ప్రజాసంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.



రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కె సుందర్ పాల్



రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ మనోహరం

# భక్తి శ్రద్ధలతో వాచ్ నైట్ సర్వీస్ ప్రార్థనలు

**నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతు**

**రాత్రి 12గంటల వరకు చర్చిలలో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు**

**క్రైస్తవ సమాజానికి, ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన**

**రాజేంద్రనగర్ పాస్టర్స్, పాస్టరమ్మల ఫెలోషిప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు**

బుద్వేల్, డిసెంబరు31(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చర్చిలలో క్రైస్తవులు మంగళవారం రాత్రి వాచ్ నైట్ సర్వీస్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనల లో పాల్గొన్నారు. 2024వ సంవత్సరంలో ఏసుప్రభు తమ జీవితాలలో చేసిన మేలులను తలపోస్తూ సంఘ సభ్యుల ఎదుట సాక్ష్యము చెప్పి దేవుని మహిమ పరిచారు. రాత్రి 12 గంటల వరకు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

**2025వ సంవత్సరం ఆశీర్వాదకరంగా ఉండాలి: రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెవరెండ్ కె సుందర్ పాల్, రెవరెండ్ మనోహరం :**

2025వ సంవత్సరం ప్రజలందరికీ ఆశీర్వాదకరంగా ఉండాలని రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సుందర్ పాల్, రెవరెండ్ మనోహరం అన్నారు. ఏసుప్రభు అందరి జీవితాలలో మేలు చేయాలని ప్రార్థించారు. ప్రతి ఒక్కరూ నీతి మార్గంలో జీవిస్తూ , సహోదరుల పట్ల ప్రేమ, దయ, కరుణ , కలిగి జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలనే ఆలోచన కలిగి ముందుకు సాగాలన్నారు.

**ప్రతి ఒక్కరిపై దేవుని కృప ఉండును గాక : రాజేంద్ర నగర్ పాస్టరమ్మల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాస్టర్ ఎన్ స్వర్ణ రాజారామ్ , పాస్టర్ పి . అనురాధ స్వర్ణ కుమార్ :**

2025 నూతన సంవత్సరములో ప్రతి ఒక్కరిపై దేవుని కృప ఉండాలని, అందరూ ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో జీవించాలని, ఏసుప్రభు దయ అందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నామని పాస్టరమ్మ ల ఫెలోషిప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాస్టర్ ఎన్ స్వర్ణ రాజారామ్, పాస్టర్ పి అనురాధ స్వర్ణ కుమార్ లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దేవుని భయంతో జీవించాలన్నారు. ప్రతిరోజు వాక్యం చదువుతూ, ప్రార్థిస్తూ దేవుని వేడుకున్నప్పుడు అంతా మేలు జరుగుతుందన్నారు.



రాజేంద్రనగర్ పాస్టరమ్మ ల ఫెలోషిప్ అధ్యక్షురాలు పాస్టర్ పి అనురాధ స్వర్ణ కుమార్



రాజేంద్రనగర్ పాస్టరమ్మల ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి పాస్టర్ ఎన్ స్వర్ణ రాజారామ్



స్వర్గీయ మాజీ పిఎసిఎస్ చైర్మన్ మూలమల్ల కృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

# స్వర్గీయ మాజీ మూలమల్ల కృష్ణారెడ్డికి నివాళ్ళు అర్పించిన కుటుంబ సభ్యులు

కొత్తకోట, డిసెంబర్ 31(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం రామకృష్ణాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మాజీ అధ్యక్షులు స్వర్గీయ మూలమల్ల కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయన సమాధి వద్ద మంగళవారం పుష్పాంజలి ఘటించారు. స్వర్గీయ కృష్ణారెడ్డి పెద్ద కుమారుడు మూలమల్ల బాల్ రెడ్డి, పెద్ద కుమార్తె జానకమ్మ, కోడలు శాంతమ్మ గోవర్ధన్ రెడ్డి, కుమారుడు వెంకటేశ్వర్ రెడ్డి, మనుమడు జయపాల్ రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.



స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

# ఘనంగా గ్రామోత్సవ సేవ

ఆత్మకూర్, డిసెంబర్ 31(ప్రభాత ఉదయం) ఆత్మకూరు పట్టణ కేంద్రంలో గ్రామోత్సవ సేవ ఘనంగా జరిగింది. మీసేవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోలాట నృత్య కళాకారుల నాట్యము చాలా అధ్భుతంగా అందులో( శిశు )చిన్నారులతో కోలాట నృత్యం అద్భుతంగా ప్రదర్శించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ అధ్యక్షుడు కె.బాలేశ్వరయ్య సేవలు అందరూ కొనియాడారు. మహిళలు అందరికీ ఆలయం వద్దకు చేరవేసేందుకు బస్సులు ఏర్పాటు చేసిన విశ్వభారతి వారి కి పాండురంగస్వామి భజన పరులకు ఆలయ మహిళలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మున్సిపల్ ఛైర్మన్ దంపతుల కు, ఫ్లోర్ లీడర్ అశ్వనీ కుమార్ కి మండల వైస్ ప్రసిడెంట్ కోటేశ్ కి బాలకిష్టాపూర్ సర్పంచ్ తుకారాంకి , అయ్యప్ప ఆలయ నిర్వాహకులు బంగారు భాస్కర్ కి విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు డి.కె ప్రకాష్ కి , మిత్రులు బ్రాహ్మణ అద్యక్షులు డి.శ్రీనివాస్ రావు కి పట్టణళవర్తక సంఘ అద్యక్షులు యాదగిరి శెట్టి , మాజీ సర్పంచ్ రాములు కి మాజీ ఎమ్.పి.టి.సి డి.వెంకటనరశింహరావు కు ధన్యవాదాలు తెలియజేశారు.

# కేరళ నర్సుకు దక్కని ఊరట

## వ్యక్తిని హత్య చేసిన కేసులో ఉరిశిక్ష

## క్షమాభిక్షను తిరస్కరించిన ఆ దేశ అధ్యక్షుడు

న్యూఢిల్లీ, డిసెంబరు31(ప్రభాత ఉదయం): యెమెన్ దేశంలో అక్కడి వ్యక్తిని హత్య చేసిన కేసులో దోషిగా తేలి ఉరిశిక్ష పడిన భారతీయ నర్సు నిమిషా ప్రియకు ఆ దేశ అధ్యక్షుడి కరుణ దక్కలేదు. ఆమె పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను యెమెన్ అధ్యక్షుడు రషద్ అల్-అలిమి తిరస్కరించారు. దాంతో ఆమెకు మరణశిక్షకు అధ్యక్షుడి ఆమోదం లభించినట్లయ్యింది. అయితే నర్సు మరణశిక్షకు ఆమోదం తెలిపిన అధ్యక్షుడు.. ఆ శిక్ష అమలుకు మాత్రం నెల రోజుల గడవు ఇచ్చారు. నిమిషా ప్రియ 2017లో తలాల్ అబ్దో మహదీ అనే యెమెన్ పౌరుడి నుంచి తన పాస్‌పోర్ట్‌ను తీసుకునే క్రమంలో అతడికి మత్తుమందు ఇంజెక్ట్ చేసి హతమార్చినట్లు కేసు నమోదైంది. అనంతరం పోలీసుల విచారణలో ఆమె హత్యకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. దాంతో ట్రయల్ కోర్టు 2018లో నిమిషాకు ఉరిశిక్ష విధించింది. దానిపై నర్సు నిమిషా సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. కానీ, సుప్రీంకోర్టు కింది కోర్టు తీర్పునే సమర్థించింది. దాంతో నిమిషా ప్రియ యెమెన్ అధ్యక్షుడిని క్షమాభిక్ష కోరింది. తాజాగా యెమెన్ అధ్యక్షుడు ఆమె క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించారు. అయితే ఉరిశిక్ష అమలుకు నెల రోజుల సమయం ఇచ్చారు. ఈ పరిణామాలపై కేంద్ర విదేశాంగ శాఖ స్పందించింది. యెమెన్‌లో నిమిషా ప్రియా మరణశిక్ష అంశం తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. శిక్ష నుంచి ప్రియను బయటపడేయటానికి ఆమె కుటుంబం చేస్తున్న ప్రయత్నాలు, పడుతున్న ఆవేదనను తాము అర్థం చేసుకున్నామని పేర్కొంది. ఈ విషయంలో భారత ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. నిమిషా ప్రియను ఉరిశిక్ష నుంచి తప్పించడానికి ఆమె కుటుంబసభ్యులు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో యెమెన్ అధ్యక్షుడు ఆమె క్షమాభిక్షను తిరస్కరిండం దిగ్భ్రాంతికి గురిచేసిందని జైశ్వాల్ పేర్కొన్నారు. కేరళలోని పాలక్కడ్ జిల్లాకు చెందిన నిమిషా ప్రియ ఉపాధి కోసం 2014లో భర్త, కూతురితో కలిసి యెమెన్‌కు వెళ్లారు. ఆర్థిక కారణాలవల్ల భర్త థామస్, కూతురు కొద్ది రోజుల్లోనే స్వదేశానికి వచ్చారు. ప్రియ మాత్రం అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తూ.. ఏడాది తర్వాత సొంతంగా క్లినిక్ ఏర్పాటు చేసుకోవాలని భావించింది. అందుకోసం తన భర్త స్నేహితుడైన తలాల్ అబ్దో మహదీ సహాయం కోరింది. అక్కడ విదేశీయులు ఏదైనా సొంత వ్యాపారం లేదా సంస్థ ఏర్పాటు చేయడానికి అవసరమయ్యే లైసెన్స్ పొందాలంటే యెమెన్ జాతీయులు హామీ ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే ఆమె తలాల్ సాయం కోరింది. ఈ క్రమంలో నిమిషా ప్రియ పాస్‌పోర్టును తన దగ్గర పెట్టుకున్న తలాల్ అబ్దో.. ఆ తర్వాత దాన్ని తిరిగి ఇచ్చేందుకు ని రాకరించాడు. దాంతో నిమిషా తన పాస్‌పోర్టును తిరిగి తీసుకోవడం కోసం అతడికి మత్తుమందు ఇచ్చి హత్యచేసింది.

## పదవి విరమణ చేసిన చీఫ్ ఇంజనీర్ శివకుమార్‌ను సన్మానించిన మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి



పదవి విరమణ చేసిన చీఫ్ ఇంజనీర్ శివకుమార్ దంపతులను సన్మానిస్తున్న వెంకటేశ్వర రెడ్డి

కొత్తకోట, డిసెంబర్ 31(ప్రభాత ఉదయం) హైదరా బాదులో చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో గతంలో వనపర్తి జిల్లా పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్లో మొదట కొత్తకోట సబ్ డివిజన్ డిప్యూటీ ఇంజనీర్, వనపర్తి జిల్లా పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తూ ప్రమోషన్ పై హైదరాబాదులో చీఫ్ ఇంజనీర్ గా పనిచేసిన పి శివకుమార్ ను మంగళవారం పదవి విరమణ ఈరోజు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి పదవి విరమణ సందర్భంగా శేష జీవితం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# లక్ష డప్పులు-వేల గొంతులు విజయవంతం చేద్దాం

## బీసీ కవులు, కళాకారులు...

## 30 ఏళ్ల నా పోరాటం సాధించి తీరుతా...మందకృష్ణ మాదిగ

## మాలా మాదిగలు వాటాలు పంచుకోవడం ప్రజాస్వామికమే...దరువు అంజన్న



కూకట్‌పల్లి,డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం) ఎస్సీ, ఏబీసీడీ ల వర్గీకరణ ముమ్మాటికి ప్రజాస్వామ్యమైనదని, గత 30 సంవత్సరాలుగా మాదిగల ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమం ఎడతెరిపి లేకుండా సాగిందని, నేడు చివరి దశలో ఉండగా అడ్డుకాలేయడం సమంజసం కాదని, మాదిగలు,మాదిగ ఉప కులాలు, వాస్తవానికి వెనుకబడి ఉన్నాయని అందుకే వారికి న్యాయం జరగాలని రేపు జరగబోయే లక్ష డబ్బులు వేదమంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగమవుతామని బీసీ కవులు, కళాకారులు అన్నారు. మేడ్చెల్ జిల్లా షాపూర్ నగర్, ఏఐటీయూసీ భవన్ లో ప్రముఖ కవి గాయకులు ఓయూజేఏసీ ఉద్యమ నేత దరువు అంజన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య ఆతిదిగా మంద కృష్ణ మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తామని ముందుకొచ్చిన ప్రతి పార్టీకి మద్దతు తెలిపాం. నేను ఏ పార్టీలో చేరలేదు, భవిష్యత్తులో కూడా చేరనని, ఇప్పటి వరకు నా కండువా మారలేదు, భవిష్యత్తులోనూ మారదు అని అన్నారు. జాతి కోసమే ఏ పార్టీకైనా మద్దతు ఇచ్చామని,. ఏ పార్టీతోనైనా యుద్ధం చేస్తామని తెలిపారు. టీడీపీ, కాంగ్రెస్, బిఆర్ఎస్ లకు కూడా మద్దతు ఇచ్చామని, చివరకు ప్రధానమంత్రి ఇచ్చిన హామీతో బీజేపీకి మద్దతు ఇచ్చామని అన్నారు. మొదటి టీడీపీ తరువాత కాంగ్రెస్, ఉద్యమ కాలంలో బిఆర్ఎస్ లకు అలాగే గత 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ కు కూడా మద్దతు ఇచ్చామని, మా నిర్ణయాలు మా జాతి కోసమే తప్ప వ్యక్తిగతం కాదు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అవిడఫిట్ దాఖలు చేసిందని, తద్వారానే ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమమైందని తెలిపారు. కాంగ్రెస్ లో మాలలకు పలుకుబడి ఎక్కువని, దేశంలో మూడు పదవులు ఉన్న కుటుంబాల్లో గాంధీ కుటుంబం తరువాత మళ్ళీ మాలలకే ఉందని అన్నారు. ఖర్గే కుటుంబంలో మూడు పదవులు, వివేక్ కుటుంబంలో మూడు పదవులు ఉన్నాయి. రెడ్డి కులస్తుల కుటుంబాలలో కూడా మూడు పదవులు లేవు కానీ మాలలకి ఉన్నాయి.ఇది వారి పలుకుబడికి సాక్ష్యం. ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి బలమైన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్ని రోజులు తెర వెనుక ఉండి ఎస్సీ వర్గీకరణను అడ్డుకున్న వాళ్ళు ఇప్పుడు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. వారి పలుకుబడిని ఉపయోగించి ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటున్నారు. వారికి లక్షల కోట్ల డబ్బులు, టీవీ, పేపర్, మీడియాతో పాటు రాజకీయ ప్రాబల్యం ఉంది. అలాంటి బలవంతులతో మాదిగలు పోరాడాల్సి వస్తుంది. ఎస్సీ వర్గీకరణ మీద రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నట్లు కనపడినప్పటికి ఆయన మీద మాలల ప్రభావం తీవ్రంగా ఉంది. ఇటీవల మాదిగల మేధావుల సభలో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం కానీ అడ్డుకునే శక్తులు బలంగా ఉన్నాయని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నాటి కన్నా నేడు ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి మాలలు శక్తినంతా ప్రయోగిస్తున్నారు. అందువల్లే ఎస్సీ వర్గీకరణ జాప్యం జరుగుతుంది. ఈ అడ్డంకులను ఎదుర్కొని జాతిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉంది. వివేక్ వెంకటస్వామి దగ్గర లక్షల కోట్ల డబ్బులు ఉన్నాయి. మాదిగల దగ్గర లక్షల డప్పులు ఉన్నాయి. డబ్బులు ఉన్నోళ్ళ దగ్గర అధర్మం ఉన్నది. డప్పులు ఉన్నోళ్ల దగ్గర ధర్మం ఉన్నది. కనుక ధర్మమే గెలుస్తుంది ,ఎస్సీ వర్గీకరణ జరిగి తీరుతుంది. ఈ అంతిమ పోరాటానికి డప్పులతోనే సిద్ధం అవుదాం. ముప్పై ఏళ్ల పోరాటంలో కళాకారుల పాత్ర పరిమితంగా ఉంది. కానీ అంతిమ పోరాటంలో జాతిని గెలిపించాల్సిన బాధ్యత కళాకారులదే... కళా నాయకులదే... ఎస్సీ వర్గీకరణ మీద జరుగుతున్న కుట్రలను ఎదుర్కోవడానికి వెయ్యి గొంతులు లక్ష డప్పులు మహా ప్రదర్శన. ఈ చారిత్రక కార్యక్రమంలో కళాకారులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలి. జనవరి 3 నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి గొంతులు లక్ష డప్పులు విజయవంతం కోసం రథయాత్రలు ఆరంభం. ఫిబ్రవరి 3 న ఛలో హైదరాబాద్ వెయ్యి గొంతులు లక్ష డప్పులు మండే మాదిగ గుండెల చప్పుళ్ళు.125 అడుగుల అంబెద్కర్ విగ్రహం నుండి మహా ప్రదర్శన ప్రారంభమై నెక్లెస్ రోడ్ మీదుగా బయలుదేరి సంజీవయ్య పార్క్ నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, దండోరా ఇంచార్జి జాతీయ అధ్యక్షుడు ఎన్ వై అశోక్ మాదిగ , పాటమ్మ రాంబాబు,సిపిఐ ఉమా మహేష్, బీసీ ఉద్యమ నేత,బత్తుల సిద్దేశర్లు, కవి భైరగి మోహన్, వెంకటాచారి, భాస్కర్ చారీ,ముత్యపగా మల్లేష్, దుడ్డు రాహుల్, సాయిరాజ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి ఉత్తమ సేవలే గుర్తింపు తీసుకువస్తాయి



గద్వాల జిల్లా ప్రతినిధి , డిసెంబర్ 31(ప్రభాత ఉదయం)ఉద్యోగం చేసే ప్రతి వ్యక్తి పదవీ విరమణకు చేరుకుంటారని, వారి ఉత్తమ సేవలే వారికి గుర్తింపు తీసుకువస్తాయని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అన్నారు. మంగళవారం ఐడిఓసి తమ ఛాంబర్ నందు జిల్లా క్రీడా అధికారి బి.ఎస్ ఆనంద్ పదవీ విరమణ సందర్భంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బి.ఎస్. ఆనంద్ గద్వాల జిల్లాలో క్రీడా రంగంలో చేసిన కృషి, క్రీడా కార్యక్రమాలలో అందించిన మార్గదర్శకత అభినందనీయమైనవి అని ప్రశంసించారు.ఆయన వ్యక్తిగతంగా, వృత్తి పరంగా ఉత్సాహభరితంగా ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనివారని అన్నారు. రిటైర్మెంట్ పొందిన తరువాత భవిష్యత్ జీవితం బాగుండాలని, ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగా రావు, ఎ.ఓ వీర భద్రప్ప,అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలులో హద్దు మీరోద్దు

## మాదకద్రవ్యాలు వాడినా, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవు...

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు... డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు..

## బాలానగర్ జోన్ ఏడీసీపీ సత్యనారాయణ




కూకట్‌పల్లి,డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం) నూతన సంవత్సర వేడుకలలో భాగంగా బాలానగర్ పోలీస్ స్టేషన్ పరదిలో నర్సాపూర్ చౌరస్తా వద్ద నూతన సంవత్సర వేడుకలు సజావుగా జరుపుకోవడంపై అవగాహనా కార్యక్రమం మంగళవారం బ్రైట్ ఫ్యూచర్ ఎన్జీవో సహకారంతో బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా బాలానగర్ జోన్ అడిషనల్ డీసీపీ పి. సత్యనారాయణ, ఏసీపీ జి. హనుమంతా రావు హాజరై ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను సురక్షితంగా, సక్రమంగా నిర్వహించేందుకు సైబరాబాద్ పోలీసులు కఠిన నిబంధనలను చేపట్టారని తెలిపారు. ముఖ్యంగ నగర వ్యాప్తంగా రాత్రి 8 నుంచి బుధవారం ఉదయం 7 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు వాడినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు. ఇక, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని, ప్రధాన మార్గాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తారని, ఎవరైనా డ్రంక్ డ్రైవ్‌లో దొరికితే వదిలిపెట్టేది లేదన్నారు. కొందరు వ్యక్తుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాల ద్వారా అమాయకుల ప్రాణాలు పోతున్నాయని, ఈ క్రమంలో బాలానగర్ పరదిలో మంగళవారం రాత్రి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎసిపి హనుమంతా రావు నిర్వాహకులకు ముఖ్య సూచనలు చేశారు. ఈవెంట్ వేదికల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం తప్పనిసరి అన్నారు. అదనంగా, శబ్ద కాలుష్య నిబంధనలకు అనుగుణంగా రాత్రి 10 గంటల తర్వాత బహిరంగ లౌడ్ స్పీకర్లను తప్పనిసరిగా ఆఫ్ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఐ నాగి రెడ్డి, ఎస్ఐలు హాజీ మియా, సరితా రెడ్డి, బ్రైట్ ఫ్యూచర్ ఎన్జీవో ప్రతినిధులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.




# ఐఆర్‌సీటీ మళ్లీ డౌన్

## ఇది నెలలో మూడోసారి.. తీవ్ర అసహనానికి గురైన ప్రయాణికులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం) ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజమ్ కార్పొరేషన్ వెబ్‌సైట్ మరోసారి డౌనయ్యింది. మంగళవారం ఉదయం ఆశ్చర్యకరంగా తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలోనే వెబ్‌సైట్ మొరాయించింది. దాంతో యూజర్లు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం వెబ్‌సైట్‌ను సరిదిద్దే పనులు కొనసాగుతున్నాయని, అందువల్ల కొంతసేపు టికెట్ బుకింగ్‌లు, కాన్సిలేషన్‌లు చేయడం వీలుపడదని ప్రకటించారు. కాగా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ డౌన్ అవడం ఈ నెలలో ఇదే తొలిసారి కాదు. ఇప్పటికే రెండు సార్లు ఈ సమస్య వచ్చింది. తాజాగా మూడోసారి సమస్య తలెత్తింది. డిసెంబర్ 26న ఏకంగా గంటన్నర పాటు బుకింగ్స్ నిలిచిపోయాయి. అంతకు ముందు డిసెంబర్ 9న కూడా వెబ్‌సైట్ రెండు గంటలపాటు సతాయించింది. ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా టూర్ ప్లాన్ చేసుకున్నవాళ్లు టికెట్ బుక్ చేసుకుందామంటే సమస్య తలెత్తింది. వెబ్‌సైట్ ట్రాకర్ డౌన్ డిటెక్టర్ ప్రకారం దాదాపు 47 శాతం మందికి వెబ్‌సైట్ యాక్సెస్ కాలేదు. 42 శాతం మందికి యాప్ ఓపెన్ కాలేదు. 10 శాతం మంది టికెట్ బుకింగ్ చేసుకోలేకపోయారు. ఉదయం 10 గంటల నుంచి యూజర్లు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. దీనిపై రైల్వేశాఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. గతంలో రెండుసార్లు సైట్ డౌన్ అయినప్పుడు కూడా రైల్వే శాఖ ఎలాంటి స్పందన తెలుపలేదు. కాగా ఈ నెలలో మూడు సందర్భాల్లోనూ తత్కాల్ టికెట్లు ప్రారంభం కావడానికి సరిగ్గా 10 నిమిషాల ముందే ఉదయం 9.50 గంటలకు సైట్ డౌన్ కావడం గమనార్హం.

# పట్నం నరేందర్‌రెడ్డికి నోటీసులు

హైదరాబాద్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం) కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి బొంరాస్‌పేట పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్ నేత శేఖర్‌పై రోటిబండ తండావాసులు దాడి చేసిన ఘటనలో జనవరి 2న విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే రోటిబండ తండా ఘటనలో పట్నం నరేందర్ రెడ్డికి హైకోర్టు షరతులతో కూడి బెయిల్ ఇచ్చింది. అయితే బెయిల్‌పై ఉండి కూడా షరతులను ఉల్లంఘిస్తూ ప్రెస్ మీట్ పెట్టారని బొంరాస్‌పేట పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎల్లుండి విచారణకు రావాలని మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు పంపించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608